## క్లుప్తంగా

### నాణ్యమైన విద్యతోనే ఆవిష్కరణలు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రతినిధులు

**మొయినాబాద్‌రూరల్‌:** విద్యార్థులు విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు కృషి చేయాలని ఎన్కెపల్లి ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి, ఎస్‌టీఎఫ్‌ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పోచయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎన్కెపల్లి ప్రభుత్వ పాఠశాలలో యూనైటెడ్‌ వే ఆఫ్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో అకృతి ఫౌండేషన్‌, ఆవిష్కార్‌ కమిటీ కలిసి మ్యాథ్స్‌ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక, జెడ్పీ పాఠశాలల విద్యార్థులకు గణితశాస్త్రంపై అవగాహన కల్పించారు. సమాజంలో మ్యాథ్స్‌ ప్రాధాన్యతను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోండి


రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

**మొయినాబాద్‌:** రుణమాఫీ కాని రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అనురాధ సూచించారు. మంగళవారం మొయినాబాద్‌ రైతు వేదికలో రుణమాఫీ కాని రైతుల వద్ద దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసిన రూ.2 లక్షల రుణమాఫీలో కొంత మంది రైతులకు ఆధార్‌, రేషన్‌ కార్డు వివరాలు సరిగాలేక మాఫీ కాలేదని.. అలాంటి రైతులంతా వ్యవసాయాధికారులకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు సుమారు 200 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. బుధవారం మండల పరిధిలోని పెద్దమంగళారంలో దరఖాస్తులు స్వీకరిస్తామని.. గ్రామంలోనే అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు కుమార్‌, సునీల్‌, భారతీయ కిసాన్‌ సంఘ్‌ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సామ మాధవరెడ్డి, చిలుకూరు మాజీ సర్పంచ్‌ సంగెరి మల్లేష్‌, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన

**షాబాద్‌:** పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండలంలోని పోతుగల్‌ పంచాయతీ కార్యదర్శి అశోక్‌ సూచించారు. మంగళవారం గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటి జ్వర సర్వే చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి వివరాలు సేకరించి జాబితాను ఉన్నతాధికారులకు అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.

### అక్రమ నిర్మాణాల తొలగింపు


జేసీబీతో తొలగిస్తున్న ప్రహరీ

**కొందుర్గు:** మండలంలోని మహదేవ్‌పూర్‌ మల్లన్న చెరువు శిఖం భూమిలో ఏర్పాటు చేసిన ప్రీకాస్ట్‌ గోడని మంగళవారం అధికారులు తొలగించారు. మహదేవ్‌పూర్‌ శివారులోని సర్వేనంబర్‌ 297లో 22 గుంటల విస్తీర్ణంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రీకాస్ట్‌ వేయడంతో తొలగించినట్లు ఇరిగేషన్‌ డీఈ సత్యప్రకాష్‌ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఐ శివకుమార్‌, ఇరిగేషన్‌ ఏఈ క్రాంతి, పోలీసులు ఉన్నారు.

### వర్షానికి కూలిన ఇల్లు


కూలిన ఇంటిని చూపిస్తున్న బాధితురాలు

**షాబాద్‌:** ఇటీవల కురుస్తున్న వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం షాబాద్‌ గ్రామానికి చెందిన గౌసియా బేగం ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

## మట్టి విగ్రహం..

# పర్యావరణ హితం

- కాలుష్య రహిత విగ్రహాల వైపు భక్తుల మొగ్గు
- సమీపిస్తున్న గణేశ్‌ నవరాత్రి ఉత్సవాలు
- 17 ఏళ్లుగా మట్టి ప్రతిమలను తయారు చేస్తున్న ప్లే గణేశ్‌ సొసైటీ

**పండగను పర్యావరణ హితంగా నిర్వహించే బాధ్యత ప్రతి ఒక్కరిది. వినాయక చవితి సమీపిస్తున్న వేళ మట్టి విగ్రహాలను పూజించాలని అటు ప్రభుత్వాలు, ఇటు స్వచ్ఛంద సంస్థలు నొక్కి చెబుతున్నాయి. 17 ఏళ్లుగా మొయినాబాద్‌ మండలంలో మట్టి విగ్రహాలను ప్లే గణేశ్‌ సొసైటీ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నారు.**


ఆకర్షణీయంగా మట్టి విగ్రహం


గణనాథులను పేపర్లలో ప్యాకింగ్‌ చేస్తున్న కూలీలు

**మొయినాబాద్‌రూరల్‌:** మట్టి వినాయక విగ్రహాలను మండలంలోని హిమాయత్‌నగర్‌లో గత 17 ఏళ్లుగా రాష్ట్ర ప్లే గణేశ్‌ సొసైటీ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నారు. ఇదే వృత్తిగా మలచుకొని పలువురు ఉపాధి పొందుతున్నారు. మట్టి విగ్రహాలకు పట్టణాలు, పల్లెల్లోనూ మంచి ఆదరణ లభించడంతో ఆర్డర్లు తీసుకొని సైజు, వివిధ ఆకారాల్లో తయారు చేసి పంపిస్తున్నారు. నగరంలోని ట్యాంక్‌బండ్‌, నాంపల్లి ఎగ్జిబిషన్‌ గ్రౌండ్స్‌లో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు ద్వారా దాదాపు రెండు లక్షల మట్టి వినాయకులను ప్రజలకు పంపిణీ చేసేందుకు తరలించనున్నారు.

**స్వచ్ఛతకు ప్రతిరూపం**

మట్టితో చేస్తున్న గణపతి విగ్రహాలు పర్యావరణ హితంగా తయారు చేస్తుండడంతో ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. కాలుష్యాన్ని కలిగించకుండా సాధారణ రంగులు వాడడంతో నగరవాసులు వీటిపై మక్కువ చూపిస్తున్నారు. ప్రస్తుతం అర ఫీటు మొదలుకొని ఏడు ఫీట్ల వరకు విగ్రహాల సైజును తయారు చేసి వాటికి మెరుగులు దిద్దుతున్నారు. రూ.25 రూపాయలు మొదలుకొని రూ.20 వేల వరకు వినాయక విగ్రహాల ధరలు నిర్ణయించారు. వీటిని మొయినాబాద్‌ మండలంతో పాటు జంట నగరాలకు, ఇతర జిల్లాలకు బుకింగ్‌ ద్వారా ఎగుమతి చేస్తున్నారు. గతంలో రెండున్నర లక్షల విగ్రహాలు తయారు చేయగా, ప్రస్తుతం పట్టణ ప్రాంతంలో ఉద్యోగులు వీటిపై మక్కువ చూపిస్తున్నారు. దీంతో మూడు లక్షలకు పైగా విగ్రహాలను తయారీ చేస్తున్నారు. సొసైటీ ఆధ్వర్యంలో దాదాపు 25 మంది ఆరు నెలల పాటు ఉపాధి పొందుతున్నారు.

**బ్యాంకులు రుణాలు ఇవ్వాలి**



ప్రభుత్వానికి రెండు లక్షలకు పైగా విగ్రహాలను సరఫరా చేస్తున్నాం. సర్కారు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తే మరింత మందికి ఉపాధి కల్పిస్తాం. గతేడాది గవర్నర్‌ ప్లే గణేశ్‌ సొసైటీ తయారు చేస్తున్న మట్టి విగ్రహాలను చూసి అభినందించారు.

– మంజుల, రాష్ట్ర అధ్యక్షురాలు, ప్లే గణేశ్‌ సొసైటీ

## పాఠశాలకు ఫర్నీచర్‌ అందజేత


ఫర్నీచర్‌ అందజేస్తున్న లయన్స్‌ క్లబ్‌ ప్రతినిధులు

**షాద్‌నగర్‌:** పట్టణంలోని రతన్‌ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు మంగళవారం లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ షాద్‌నగర్‌ ఆధ్వర్యంలో కౌన్సిలర్‌ నడికూడ సరిత యాదగిరియాదవ్‌ దంపతులు కుర్చీలు, టేబుళ్లు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్‌ అధ్యక్షుడు గుండు నారాయణ మాట్లాడుతూ.. పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్లబ్‌ జోనల్‌ చైర్మన్‌ రమేష్‌, రాంచందర్‌, అశోక్‌, మురళీ, హెచ్‌ఎం సుధాకర్‌, ఉపాధ్యాయులు దేవమ్మ, అంగన్‌వాడీ టీచర్లు భారతి, పావని, శ్రీధర్‌, నర్సింలుయాదవ్‌, శ్రావణ్‌కుమార్‌, బాలస్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణ కోసమే షీ టీం


అవగాహన ర్యాలీలో ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి

**నందిగామ:** మహిళల భద్రత కోసమే షీ టీం ఏర్పడిందని ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటిగట్ట తండాలో మంగళవారం 'మీ నమ్మకం.. మా భరోసా.. మీరు ఒంటరి వారు కాదు' అనే నినాదంతో యువతీ, యువకులకు షీ టీం సేవల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ.. యువతులు, మహిళలు, విద్యార్థినీలు పోకిరీలతో వేధింపులకు గురైనట్లయితే తమను సంప్రదించాలని సూచించారు. అత్యవసర సమయాల్లో 100కు కాల్‌ చేయాలన్నారు. షీ టీంకు సమాచారం ఇచ్చిన మహిళల పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అంతే కాకుండా యువకులు, విద్యార్థులు మత్తుపదార్థాలను అలవాటు చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌ కానిస్టేబుల్‌ బుచ్చయ్య, సిబ్బంది భార్గవి, సురేష్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కందిలో సస్యరక్షణ ముఖ్యం

### సేవా స్ఫూర్తి ఫౌండేషన్‌ ప్రాజెక్టు మేనేజర్‌ రత్నాకర్‌


కంది పంటను పరిశీలిస్తున్న రత్నాకర్‌, రైతులు

**షాబాద్‌:** రైతులు కంది పంట సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్‌ ప్రాజెక్టు మేనేజర్‌ గొల్లపెల్లి రత్నాకర్‌ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రేగడిదోస్వాడ గ్రామంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో షెడ్యూల్‌ కులాల రైతులకు టీడీఆర్‌జీ 59 తెలంగాణ కంది–3 రకం విత్తనాలను రెండు నెలల క్రితం పంపిణీ చేయగా.. ఆ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగు చేసిన కంది పంటను క్షేత్ర సందర్శన చేసి రైతులకు సస్యరక్షణ పద్ధతులు, ఎరువుల యాజమాన్యం వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. క్రీడ కృషి విజ్ఞాన కేంద్రం గ్రామానికి అందించిన సేవలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు మాధవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీను, నర్సింహులు ఉన్నారు.

## పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులతో జిల్లా నేతలు

**నందిగామ:** పీఆర్‌టీయూ టీఎస్‌ నూతన మండల కమిటీని నందిగామలో మంగళవారం ఎన్నుకున్నారు. సర్వసభ్య సమావేశాన్ని మండల శాఖ అధ్యక్షుడు పెద్దమారు రాఘవేందర్‌ అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పీఆర్‌టీయూ టీఎస్‌ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్‌, ప్రధాన కార్యదర్శి మహేందర్‌ రెడ్డిలు హాజరై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా రాఘవేందర్‌, ప్రధాన కార్యదర్శిగా శ్రీహరిటం, అసోసియేట్‌ అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా శివలింగమ్మ, కార్యదర్శిగా స్వర్ణలతలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు పరిశీలకులుగా వీరమల్లేష్‌, వెంకటరమణలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయసాగర్‌, ఆంజనేయులు, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్‌, శ్రీనివాస్‌రెడ్డి, అర్నాల్డ్‌, సోం భూపాల్‌, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

## హక్కులను పరిరక్షించుకుందాం

### గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్‌


సురేష్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న మల్లేశ్‌గౌడ్‌

**మొయినాబాద్‌ రూరల్‌:** గౌడ కులస్తుల హక్కుల పరిరక్షణకు కలిసికట్టుగా కృషి చేద్దామని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేశ్‌గౌడ్‌, జిల్లా అధ్యక్షుడు సిద్ధంతి నర్సింహ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని ఎన్కేపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎలిగని సురేశ్‌గౌడ్‌, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అల్లం శేఖర్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్‌ మాట్లాడుతూ.. గౌడ కులస్తులు విద్యావంతులుగా, వ్యాపారవేత్తలుగా, రాజకీయ నేతలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండలం అధ్యక్షుడు బస్వపురం అంజయ్యగౌడ్‌ నర్సింహగౌడ్‌, అంజయ్యగౌడ్‌, విజయ్‌కుమార్‌గౌడ్‌, యాదయ్యగౌడ్‌, శేఖర్‌గౌడ్‌, ఎలిగని సురేష్‌గౌడ్‌, సత్యనారాయణగౌడ్‌, రాము, వివిధ గ్రామాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మైసమ్మ ఆలయంలో పూజలు

**షాద్‌నగర్‌:** పట్టణంలోని రైతు కాలనీలో ఉన్న కోట మైసమ్మ దేవాలయంలో మంగళవారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నేత చెంది తిరుపతిరెడ్డి దంపతులు హోమం నిర్వహించారు. అదేవిధంగా అమ్మవారి పల్లకీసేవ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, బుచ్చన్న, శుక్రవర్ధన్‌రెడ్డి, మల్లేశ్‌ తదితరులు పాల్గొన్నారు.



## విద్యతోనే అభివృద్ధి సాధ్యం


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

**షాద్‌నగర్‌:** విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. మండల పరిధిలోని మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో పని చేస్తున్న ఇద్దరు తాత్కాలిక సిబ్బందికి ఎమ్మెల్యే తన వేతనం నుంచి రూ.72 వేల చెక్కు, కళాశాలకు కావాల్సిన కంప్యూటర్‌ను మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుతో కలిసి ప్రిన్సిపాల్‌కు అందజేశారు. అనంతరం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ఆదుకునేందుకు తాము ఎప్పుడూ ముందుంటామన్నారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు మాట్లాడుతూ.. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ప్రతిఒక్కరూ ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ మంజుల, అధ్యాపకులు ప్రశాంత్‌, శ్రీశైలం, నాయకులు శ్యాంసుందర్‌, రాజు, వెంకటేష్‌గుప్తా, మల్లేశ్‌, బబ్లూ, షబ్బీర్‌, శ్రీకాంత్‌రెడ్డి, రఘు, చంద్రశేఖర్‌, దర్శన్‌, ముబారక్‌ తదితరులు పాల్గొన్నారు.

## ఎకరాకు రూ.30వేలు పరిహారం ఇవ్వాలి

**తలకొండపల్లి:** భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించాలని బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్‌ అనిల్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో తలకొండపల్లి మండలంతో పాటు, మాడ్గుల్‌, ఆమనగల్లు, కడ్తాల్‌ మండలాల్లో మొక్కజొన్న, పత్తి, వరి, జొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఈ నాలుగు మండలాల్లో సుమారు 30 వేల ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని, వ్యవసాయ అధికారులచే ప్రభుత్వం పంట నష్టం సర్వే చేయించి, తగిన నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

## చెరువులు, కుంటలను కాపాడాలి

### మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు


వర్షానికి తెగిన చెరువు కట్టను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే తదితరులు

**షాద్‌నగర్‌:** చెరువులు, కుంటలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు అన్నారు. మంగళవారం షాద్‌నగర్‌లోని సీఎస్కే, మామిడికుంట, జాలాది కుంట, బొబ్బిలి చెరువు, గోల్డెన్‌ పార్కులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల పక్కన ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్‌లలో ఆక్రమణలు చేసి విల్లాలు నిర్మించారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇరవై ఏళ్లుగా ఫిరంగి కాలువ, ఆజం అలీఖాన్‌ తోట, పురాతన మంచినీటి బావి కట్టడాల విషయంలో పోరాటాలు చేస్తున్నా అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదన్నారు. పార్టీలకు అతీతంగా చెరువులు, కాల్వలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో కలెక్టర్‌ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి దుర్గాప్రసాద్‌, డాక్టర్‌ ఏఎస్‌ రావు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్‌ నర్సింహ, నాయకులు ఆనంద్‌, కుమార్‌గౌడ్‌, అనంతం తదితరులు పాల్గొన్నారు.

## కంపెనీపై చర్యలు తీసుకుంటాం

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


పరిశ్రమను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

**చేవెళ్ల:** ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపించే కంపెనీలపై చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని అంతారం గ్రామ సమీపంలో ఉన్న మెరైన్‌ ఫుడ్స్‌ అండ్‌ ఫీడ్స్‌ కంపెనీని మంగళవారం గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కంపెనీ నుంచి వెలువడే దుర్వాసనతో కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. దుర్వాసనకు భరించలేక ముక్కుకు టవాల్‌ కట్టుకొని కంపెనీలో పరిశీలించారు. ఇక్కడ కుళ్లిపోయిన మాంసం వ్యర్థాలతో ఆక్వా రంగానికి సంబంధించిన ఉత్పత్తులు తయారు చేస్తోందన్నారు. మాంసం వ్యర్థాలతో పని చేసే ఈ కంపెనీ నుంచి వచ్చే పొల్యూషన్‌తో చుట్టూ ఉన్న అంతారం, హస్తేపురం, కౌకుంట్ల, తంగడపల్లి తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఇలాంటి కంపెనీలు జనవాసాలు లేని ప్రాంతంలో పెట్టుకోవాలని ఎమ్మెల్యే కంపెనీ ప్రతినిధులకు సూచించారు. కంపెనీలోకి రావాలంటేనే భరించలేని కంపు వాసన వస్తుందన్నారు. దీనిపై కలెక్టర్‌, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, అంతారం, హస్తేపురం గ్రామస్తులు ఉన్నారు.